# వివాహయోగము: విడాకులభోగము

"సూరిమూర్తి"

వెంకట్రావూ సుశీలా రెండేళ్లు కాపురం చేశారు. వారి వివాహం యేదో పూర్వాచారం ప్రకారం పెద్దలు నిశ్చయించి చేసేసినది కాదు. ఒకరి గుణాలనొకరు స్వయంవిని ముఖాలుచూచుకొని సంభాషణల చేసుకొని అనుమతులు తీసుకొని చేసుకొన్నది. అన్నిటికంటే ముఖ్యం వెంకట్రావుకు ఆమె పేరుమీద మోహంకలిగే చేసుకున్నా డనుకోవచ్చును.

పూర్వంనుంచి ఇప్పటికి కాలం మారినది. పూర్వం తలిదండ్రులకుంకట్లు కొలిచి ఒకరికొకరు తగుదురని భావించి బొమ్మలపెళ్ళిళ్ళలాగ చేయడానికే ముచ్చట పడేవారు. ఇప్పుడు శారదా అక్టువల్ల చదువులగోలవల్ల యెల్లాగా పూర్వంలాగ పెళ్ళియీడు సమయాన పెళ్ళిచేయ వీలు లేదు గనుక, వాళ్ళిష్టం వచ్చినప్పుడే చేసుకొనీ అని పెద్ద లూరుకుంటున్నారు. పిల్లలుకూడా యెల్లాగా పెద్దవాళ్ళమైనాము కనుక యింకా పెద్దవాళ్ళమైతే నేమని పెళ్ళిళ్ళు పోనుపోను చేసుకుంటున్నారు. కాలుజారినా చేయికాలినా తప్పంఅనే నిషేధం క్రమంగా పోతున్నది. ఏదో జరుగకుంటేను జరిగిన తరువాతనే తప్ప సాధారణంగా అనేకం పెళ్ళిళ్ళు కాలేదు?

ఏమీ కారణంగా స్వయంవర వివాహాల ముచ్చట యెల్లాగ తీరుతుందని నిశ్చయించి పెద్దలు ఇట్టి పరిచయాల కవకాశాలిచ్చి అంగీకరిస్తున్నారు. వెంకట్రావు సుశీల పెళ్ళికూడా యిట్టిదే.

సుశీలతల్లి రమణమ్మ అఖండ స్త్రీ స్వాతంత్ర్యవాదిని. వెంకట్రావు తండ్రి రామమూర్తిపంతులు సంపూర్ణ సంఘసంస్కారి కనుక వీరి వివాహం స్వాభిప్రాయానుకూలంగా జరగడానికెట్టి ఆటంకమూ లేకపోయింది.

సుశీల స్కూలుఫయినలు పేసయినా ఎక్కడా వెంటనే ఉద్యోగం దొరకనందున ఇల్లు కనిపెట్టుకొని మొగుడికి వండిపెట్టేది. సాయంకాలం క్లబ్బులకువెళ్ళినా భోజనాలు మొదలగువాని యేర్పాటు చూసుకొనేది. వెంకట్రావుకు పొగాకు కంపెనీలో నెలకు నూరు రూపాయీలు జీతం కనుక ఈమెద సంపాదన అవసరం లేకుండానే సుఖంగా కాలం గడచేది. తాను సంపాదిస్తూ భార్య సంపాదించలేదన్న కారణంవల్ల అతనామె నెన్నడూ నిరసనగా చూడక, వచ్చిన సొమ్మంతా ఆమె చేతిలోనే పోసి ఆమె యెల్లాగ యిల్లుదిద్దితే అందుకే గర్విస్తూ వుండేవాడు. ఈఖర్చు పెట్టావేమని కాని ఆఖర్చు పెట్టలేదేమని కాని అతడన్నడూ సుశీలను ప్రశ్నించలేదు. ఎంత మిగిలింది యెంత తగిలిందన్న ప్రశ్నలసలే వేసేవాడు కాదు.

మరో సంసారంలో అయితే ఇట్టి సంపూర్ణ స్వాతంత్ర్యం పొందినభార్య అపరిమితానందం పొంది వుండేది. తాను పెనిమిటికి లొంగవలసిన అవసరం లేదు. సరేగదా అవసరమైతే అతనినే

లొంగదీసుకోగల భాగ్యం కలగడం స్త్రీకి సామాన్యమా ?

అయినా సుశీలమనస్సు మనస్సులాగ లేదు. ఒక యేడాదినుంచి ఒక మోస్తరు అనుమానం తనమీాదే తనకు కలుగ ప్రారంభించింది. ఇంతా చదువుకొని స్వయం సంపాదన లేక పురుషుడి సంపాదనమీాద బ్రతుకు తున్నావ్ అన్న చింత ఆమెకు పట్టుకున్నది. అది దాస్యచిహ్నమని, స్వాతంత్ర్య సూత్రవిరుద్ధమని భావించ దొడగినది.

వెంకట్రావుకూడా సంపూర్ణ స్త్రీ స్వాతంత్ర్య వాది. భార్యసంపాదించలేదన్న మాత్రాన ఆమెకు చిన్నచూపు చూడడం తప్పు అని అతని అభిప్రాయం. ఆ కారణంవల్లనే ఆమెకు మరీ ఎక్కువ స్వాతంత్ర్యం ఇవ్వాలనే అతని వాదం. అందువల్ల సుశీలయెడల అతనికి కలిగిన అనురాగ గౌరవాలు దినదినాభివృద్ధి పొందినవి. ఎంత దినదినాభివృద్ధి పొందినా పలకరిస్తే పలకడం నవ్వితేనవ్వడం ఉత్సాహం చూపడం మొదలైన చర్యలైనా జరుపకపోతే యెంత స్త్రీ స్వాతంత్ర్యవాది పురుషునికైనా చికాకుపుట్టక మానదు. ఇతను దీనంగా బ్రతిమాలు తున్నకొద్దీ ఆమెమొగం ముడుచుకోవడం యెక్కువైనది.

తానుకూడా నెలజీతం ప్రకారం డబ్బు సంపాదించ లేనిన్నాళ్లు, భర్తయెంత యిచ్చి యెంత చేసినా అది యజమాని వద్దనుంచి బానిసగ్రహించిన దయలాగే తోచి అసహ్యంపుట్ట దొడగినది. చీరతెస్తే చీర, సారతెస్తే సార, పవుడరు సెంటు పువ్వులు, రింగులు యేవితెచ్చి అర్పించినా విసరి కొట్టడం మొదలుపెట్టింది. కారణమతనికేమీా అర్థంకాక తహతహ లాడేవాడు.

కొన్నాళ్ళకామె అదృష్టం ఫలించింది. స్త్రీ వ్యసనాని పీడితులైన ఒక ప్రెసిడెంటు ఆమెఅర్జీ తను గ్రహించి దాస్యవిముక్తిచేయ నంగీకరించినాడు. వెంటనే ఖాళీగానున్న ఒక టీచరు ఉద్యోగములో ఆమె ట్రెయినింగు కాకపోయినా నెలకు రూ. 40 జీతంమీాన నియమించి ఆమె కృతజ్ఞత నందుకున్నాడు. అతని ఋణము నెల్లాగ తీర్చుడము అని ఆమె అలోచింప దొడగెను.

క్రమక్రమముగా వారి పరిచయం స్నేహమై ప్రేమగా పరిణమించడంలో ఆశ్చర్యం లేదు. భార్య ఉద్యోగంచేస్తూ స్వతంత్రంగా భావించుకోడం వల్ల కూడా వెంకట్రావుకు చింత కలుగలేదు. తననొక స్నేహితునిలాగ కాకుంటే మానె సేవకునిలాగైనా ఆమె పరిగణించ నందుకే అతని చింత యెక్కువైనది. ఎంత సర్దుకుందామన్నా సంసారయాత్ర సుఖముగా సాగలేదు. తన యింట్లో తనకంటె ఇతరులు ఎక్కువ స్వతంత్రంగా బ్రతుకుతున్నారు. అయినా అవమానముతోనే అతను కాలక్షేపం చేయ నిశ్చయించాడు కాని ఆమెను విడనాడి బ్రతుకుట కియ్యకొన లేదు.

అందువల్ల ఆమె కతనియెడ కలిగిన అసహ్యం మరీ యెక్కువైనది. మిత్రుల పోటీమాటలు విని ఆమె అతని యింటిలోనుంచి వైదొలగి విడాకుల కొరకు దరఖాస్తు పెట్టుకున్నది. వెంకట్రావు యెట్టి అటంకమును చెప్పక పీడావదలిపోతున్నట్లు ఊరకున్నందువల్ల ఆమె యభీప్సితమీాడేరినది, ఇప్పుడంగరంగ వైభోగములతో యథేచ్ఛగా

విహరించుచు ఆర్థికస్వాతంత్ర్య భోగము లను భవించుచున్నది.

పదిమంది పురుషులను గిలుబాడి సార్జిత ధన లోపం లేకుండా ఉద్యోగ నిర్వహణంచేసి కీర్తి గడిస్తూ పదిమందిలో తలయెత్తుకొని తిరుగుతూ మహిళా సంస్థలో ఉపన్యసిస్తూ దేశసేవ చేయుచున్నది. సంసారయాతన వుంటే ఈ పనులేవీ సాగేవికావు గదా అని యోచించి తన అదృష్టమునకు తానే గర్వించుచున్నది. ఆధునిక నాగరికతలో ఆరితేరి ముందంజ వేయుచున్న ఆమెను చూచి తలిదండ్రు లానందించుచున్నారు.

రామమూర్తి పంతులుకూడా ఇందుకు విచారించలేదు. పోయిన పెళ్ళాం యెల్లాగా పోయింది ఇంకెవ ర్తైనా కట్టుకొని తనకొడుకు సంస్కార రంగములో ముందంజవేస్తే బాగుండునని అతని కెంతో కోరికగా యున్నది. కాని వెంకట్రావుది అది యొక మోస్తరు మనోవైఖరి.

అతను సుసీలను రూపసౌందర్యాదులు గుణగణాలు మొదలగు వానినిబట్ట కాక ఆమెపేరును బట్టియే మోహించెను. ఆ మోహమింకను వదలలేదు. ఎంతమంది వచ్చి పిల్లనిస్తామన్నా పెళ్లాడక ఆజన్మ బ్రహ్మచర్య జీవనము గడుప నిశ్చయించుకున్నాడు. వఘ సంస్కారచక్ర మాగిపోయినందుకు తండ్రికిచింత. వంశము నిలచిపోతుందని తల్లికి చింత. వెంకట్రావు వేదాంత మెంతకాలము ఇట్లుంటుందో యెవరు చెప్పగలరు?

APPROVED BY GOVT. OF INDIA (I.S.D.)
ENAMEL
VITREOUS (PORCELAIN)
SIGN BOARDS
HOSPITAL WARE
HOUSE-HOLD UTENSILS
OUR WELL EQUIPPED MODERN FACTORY
AT THE SERVICES OF
ADVERTISERS; MUNCIPALITIES, DISTRICT BOARDS
RAILWAYS, HOSPITALS, ARMY & GENERAL PUBLIC
MADRAS ENAMEL WORKS LTD.
65, SYDENHAMS ROAD, MADRAS.